పకడ్బందీగా సర్వే చేపట్టాలి

● జిల్లా పంచాయతీ అధికారి కల్పన

చెన్నారావుపేట : సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన, జిల్లా పశువైద్యాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణలు అన్నారు. బుధవారం మండలంలోని అమృతండా,బోజెర్వు, 16చింతల తండా, చెరువు కొమ్ము తండాలో కల్పన, తిమ్మరాయిని పహాడ్, గొల్లపల్లి, గొల్లభామ తండా, సూర్యాపేట తండా, అమీనాబాద్ గ్రామాల్లో జిల్లా పశు వైద్యాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ సందర్శించి ఇంటింటా చేపట్టిన కుటుంబ సర్వేను పరిశీలించారు. సమగ్ర సర్వేలో ఎవరు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు, సిబ్బందికి గ్రామాలలోని ప్రజలు సమకరించాలని వారు కోరారు. అనంతరం మండలంలోని బోజేర్వు గ్రామ పంచాయతీని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అంబటి శ్రీధర్ రాజు, సూపరింటెండెంట్ ఆయేషా పర్వీన్, ఎన్యుమరేటర్లు, జీపీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

పర్వతగిరి : సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన సమగ్ర సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ సూచించారు. ఈ మేరకు మండలంలోని సోమారం, గోరుగుట్టతండా, గుంటూరుపల్లి, శ్రీనగర్ గ్రామాల్లో చేపట్టిన సర్వేను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మండల ప్రత్యేక అధికారి నీరజ పెద్దతండా గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్‌కుమార్, ఆయా గ్రామాల ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


దుగ్గొండి: మైసంపల్లిలో సర్వేను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి సంగీతలక్ష్మి


చెన్నారావుపేట: గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ కల్పన


సంగెం: కుంటపల్లిలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వేదవతి

కొనసాగుతున్న సర్వే..

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే కొనసాగుతుంది. బుధవారం మండలంలోని మైసంపల్లి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి సంగీతలక్ష్మి, లక్ష్మీపురం గ్రామంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్‌కుమార్ తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్‌లు చేసిన సర్వే పత్రాలను పరిశీలించారు. ఎంపీడీఓ అరుందతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, ఏఓ మాధవి, సూపరింటెండెంట్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ రేణుక, ఎన్యుమరేటర్‌లు,జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి: డీఎల్‌పీఓ వేదవతి

సంగెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సంపూర్ణంగా సహకరించాలని డీఎల్‌పీఓ, మండల ప్రత్యేకాధికారి వేదవతి అన్నారు. బుధవారం మండలంలోని కుంటపల్లి గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను బ్లాక్‌ల వారిగా ఆమె పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని తెలుసుకున్నారు. తప్పులు లేకుండా సర్వే పత్రాలు నింపాలన్నారు. ఎంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి వాజీద్ పాల్గొన్నారు.

వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల నరికివేత

సంగెం : పర్యావరణ పరిరక్షణ కోసం లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో నాటిన చెట్లు అర్ధంతరంగా నేలకొరుగుతున్నాయి. సంగెం మండల కేంద్రంలో బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను విద్యుత్ శాఖ అధికారులు నరికివేశారు. వనమహోత్సవంలో భాగంగా వేల సంఖ్యలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. వాటి సంరక్షణకు కంచె,నీరు పోసేందుకు సైతం నిధులు కేటాయిస్తున్నారు. మొక్కలను ఎంతో శ్రద్ధగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ కొన్ని చోట్ల మొక్కలు నాటినప్పుడు కనిపించిన శ్రద్ధ వాటి సంరక్షణపై లేదని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నారని చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు. ఇప్పటికైనా నాటిన మొక్కలను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


నరికిన భారీ వృక్షాలు

సమన్వయంతో పనిచేయాలి

నర్సంపేట : నర్సంపేటలోని ప్రతీ బూత్ నుంచి వంద సభ్యత్వాలు చేసే విధంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు నర్సంపేట, నర్సంపేట టౌన్ సంస్థాగత ఎన్నికల అధికారి కట్ల రామచంద్రారెడ్డి అధ్యక్షత బుధవారం భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల పర్వం–2024 మండల స్థాయి కార్యశాల నిర్వహించారు. గుడిపూడి రాధాకృష్ణ, వడ్డేపల్లి నర్సింహరాములు, కంభంపాటి పుల్లారావు, రేసు శ్రీనివాస్, వీరన్న, కునమల్ల పృథ్వీరాజ్, బోడ గోల్య, సూత్రపు సరిత, కొంపెల్లి రాజేందర్, గూడూరు సందీప్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట గ్రామంలో మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. కట్ల రాంచంద్రరెడ్డి, బానోత్ వీరన్న, తాళ్లపల్లి రాము, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నర్సంపేట రూరల్ : అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి బుధవారం తెలిపారు. నర్సంపేట పట్టణంలోని శాంతినగర్ చెందిన కమని జయప్రకాశ్ ఇంట్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారన్న పక్కా సమాచారం మేరకు ఎస్సై రవి కుమార్, సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దీంతో నాలుగు క్వింటాళ్ల బియ్యం లభ్యంకావడంతో సీజ్ చేసి అతని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

‘సఖి’తో మహిళలకు రక్షణ


మచ్చాపూర్‌లో మాట్లాడుతున్న శోభారాణి

గీసుకొండ : మహిళలు, బాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సఖి సెంటర్ ద్వారా పరిష్కరిస్తారని సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి, కేసు వర్కర్ తిరుమల అన్నారు. బుధవారం మండలంలోని గీసుకొండలో గ్రామైక్య సంఘాలకు, మచ్చాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో చట్టాలపై విద్యార్థులతో వారు మాట్లాడారు. జిల్లాలో సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి సెంటర్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాని మహిళలు హెల్ప్‌లైన్ 181 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.ఏపీఎం సురేశ్‌కుమార్, సీసీ సుజాత, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

‘సమగ్ర చట్టం కోసం పోరాడుదాం’



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

నర్సంపేట రూరల్ : సమగ్ర చట్టం కోసం హమాలీ కార్మికులంతా ఐక్యంగా పోరాడుదామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ అన్నారు. తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)లో మాధన్నపేట హమాలీ కార్మికులు 40 మంది బుధవారం చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా హమాలీ కార్మికులు ప్రధానంగా గోదాము, ఇతర మిల్లుల్లో పనిచేస్తున్న సమగ్రమైన చట్టం లేదని, కార్మికుల సంక్షేమానికి ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగుల దయాకర్, ప్రగతి శీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఆకుల వెంకటస్వామి, జిల్లా నాయకులు కానుగుల రంజిత్, ఆకుతోట రాజు, గడ్డం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

చెన్నారావుపేట : ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎంఎస్పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాట ప్రకారంగా ఎస్సీ వర్గీకరణ అములులోకి వచ్చిన తర్వాతనే ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. డిసెంబర్ 21న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్మయుద్ధ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి, రాష్ట్ర నాయకుడు మహేందర్, జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్, నాయకులు రాజశేఖర్, మేకల సదానందం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నల్లబెల్లి : ఈనెల 18న జరిగే ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం బొట్ల నరేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలనుంచి యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మకంటి అనిల్, మల్లయ్య, రాకేష్‌కుమార్, రవి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న కారు స్వప్న

ఖానాపురం : తనకు న్యాయం చేయాలని ఓ వివాహిత స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట బుధవారం నిరసన తెలిపింది. మండలంలోని ఎల్లాయగూడెనికి చెందిన రమేశ్‌తో కారు స్వప్నకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితంలో ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమారు నాలుగేళ్ల నుంచి తన భర్తను కుటుంబ సభ్యులతో పాటు పెద్ద మనుషులు వేరు చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే విషయంపై ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పిల్లలకు, తనకు భర్త నుంచి న్యాయం చేయాలని, పెద్ద మనుషులతో పాటు భర్త తరపు కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు వివాహిత స్వప్నను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి న్యాయం చేస్తామని తెలపడంతో నిరసన విరమించింది.

కఠిన చర్యలు తప్పవు

సాక్షి ఎఫెక్ట్..

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో ఇసుక జీరోదందాను అరికట్టాలని కలెక్టర్ సత్య శారదదేవి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ‘జోరుగా ఇసుక జీరో దందా’అనే శీర్షికతో సాక్షిలో బుధవారం కథనం ప్రచురితం కాగా కలెక్టర్ స్పందించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, నిల్వల సమగ్ర వివరాలు పంపాలని తహసీల్దార్లను కోరారు. అక్రమాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే అధికారులపై కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు


పూజలు చేస్తున్న ముదిరాజ్ నాయకులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామంలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలతో మహిళలు డప్పుచప్పుళ్లు, కోలాటాలతో నృత్యాలు చేస్తూ పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలు చల్లగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ ఎన్నారై విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజుకుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి కుమారస్వామి, బోళ్ల రవి, రాజేందర్, కీసరి ఐలయ్య, జటబోయిన నరేందర్, సురేష్, బండారి సాంబయ్య, బోళ్ల వంశీ, ఓరుగంటి దేవేందర్, మండల రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


నందిని

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి ఉన్నత పాఠశాలలో చదువుతున్న మంద నందిని రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు బి.బాలకిషన్, పీఈటీ రఘువీర్ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో వరంగల్‌లోని ఓ సిటి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వాలీబాల్ అండర్–14 బాలికల విభాగంలో నందిని అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో నందిని పాల్గొననుంది. ఈ సందర్భంగా బుధవారం ఆమెను, శిక్షణ అందించిన పీఈటీ రఘువీర్‌ను హెచ్‌ఎంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ సునీత, ఉపాధ్యాయులు వేణుకుమార్, మాధురి, వెంకటస్వామి, నాగరాజు, శివకుమార్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, హరిలాల్, గ్రామస్తులు విద్యార్థులు అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌లో ఆచార్యురాలిగా పనిచేస్తున్న రజియా బేగం పీహెచ్‌డీ పూర్తిచేసి పట్టాను పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్ తెలిపారు. రజియా బేగం ‘న్యూరో డిజెనేరేటివ్ పార్కిన్సన్స్ డిసీస్ డిటెక్షన్ యూసింగ్ మెషిన్ లెర్నింగ్ మోడల్స్’ అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథం ప్రచురించినందుకు కేఎల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా రజియాబేగంను బుధవారం బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు అభినందించారు.


రజియాబేగంను అభినందిస్తున్న బిట్స్ చైర్మన్

బీసీలకు రిజర్వేషన్ పెంచాలి

నర్సంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచాలని నర్సంపేట గంగపుత్ర సంఘం నాయకులు గుంటి కిషన్, జీజుల సాగర్, పూస ఏకాంబరం, బయ్య సాంబమూర్తి, గుంటి సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా లెక్కల ప్రకారం బీసీలో ఏ,బీ,సీ,డీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీ–ఏ కులానికి జరుగుతున్న కుట్రలను కులస్తులు గమనించాలన్నారు. ఇతర కులస్తులను బీసీ–ఏలో చేర్చరాదని విన్నవించారు.

కరాటే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ

నర్సంపేట రూరల్ : అంతర్జాతీయ కరాటే పోటీల్లో బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. 24వ ఎఫ్ఎస్‌కేఏ వరల్డ్ కప్ కరాటే చాంపియన్ షిప్ హన్సిహస్సన్ ఇస్మాయిల్ వారి ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 10 వరకు గోవాలో నిర్వహించారు. ఈ కరాటే పోటీల్లో బాలాజీ టెక్నో స్కూల్‌కి చెందిన విద్యార్థులు పాల్గొని నాలుగు బంగారు పథకాలు, రెండు వెండి పథకాలు, ఒక కాంస్య పథకం సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, కోచ్ భవానిచంద్‌లను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట రూరల్ : విద్యార్థులను అభినందిస్తున్న రాజేంద్రప్రసాద్‌రెడ్డి

విద్యార్థులకు అభినందన

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్ ఆర్డీఎఫ్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎ.అభినయ్, జె.వివేక్ ఎఫ్ఎస్‌కేఏ ప్రపంచ కప్ కరాటే చాంపియన్ షిప్‌లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రమేష్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పర్వతగిరి: అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



చెన్నారావుపేట : చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్లో నవంబర్ 14వ తేదీ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శారీరకంగా మానసికంగా క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, పీఈటీలు పొన్నం రమేశ్, ఆరె రాజు, అల్లంనేని రవి, విజయ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎఫ్‌ఏల సంఘం ఎన్నిక

దుగ్గొండి : ఫీల్డ్ అసిస్టెంట్ల(ఎఫ్ఏ) సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోత్ బాలునాయక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల సుమలత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బుగ్గ ఐలయ్య, లలిత, జయ, కవిత, శారద, స్వర్ణ, ప్రశాంత్, రవి పాల్గొన్నారు.

తాపీమేస్త్రీ గ్రామ అధ్యక్షుడిగా మహేష్



రాయపర్తి : మండలంలోని కొండూరు తాపీ మేస్త్రీ గ్రామ సంఘాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేరెల్లి మహేష్, ప్రధాన కార్యదర్శిగా నేరెల్లి రాములు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కోశాధికారిగా పూస సత్తయ్య, సలహాదారులుగా ఏసుబాబు, బర్ల యాకయ్య, ఎండీ అలిజాన్, దేవేందర్, నేరెల్లి సమ్మయ్య, సభ్యులుగా నేరెల్లి భిక్షపతి, సామేలు, రాజేష్, బోలేసాబ్, సైదులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన నేరెల్లి మహేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి పూస మధు, మాజీ ఉపసర్పంచ్ కొమ్ము రాజు, పులి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పునఃపరిశీలన చేయాలి

పర్వతగిరి : మండలకేంద్రం నుంచి కల్లెడ వైపునకు వెళ్లే డీబీఎం–48 4ఆర్ కాల్వ భూమిని ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని భూ స్థల యజమానులు కోరుతున్నారు. మండల కేంద్రం గుండా వెళ్లే ఉప కాల్వ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఆ భూమిని తిరిగి స్థల యజమానులకు కేటాయించాలన్నారు.

ఇసుక లారీ స్వాధీనం



నెక్కొండ : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. రూ.40 వేల విలువైన ఇసుకలోడు లారీ సీజ్ చేశామని ఎస్సై పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సందీప్‌తోపాటు ఓనర్ సునీల్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కొండూరు మాజీ సర్పంచ్ కర్ర సరితరవీందర్‌రెడ్డి కుమారుడు కర్ణాకర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుధవారం కర్ణాకర్‌రెడ్డి దశదినకర్మలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మధు, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ఖానాపురం : మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పర్శ సతీశ్ బుధవారం పురుషుల పొదుపు సంఘంలో చిట్టీ డబ్బులు చెల్లించి, కుమార్తె పెళ్లికార్డులు ఇవ్వడానికి వెళ్లాడు. పనులు ముగించుకోని ఇంటికి వెళ్తున్న క్రమంలో మజీద్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో సతీష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సతీశ్ కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

కాళోజీకి నివాళి

నల్లబెల్లి : కాళోజీ వర్ధంతిని మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సాంబరావు, నర్సంపేట డివిజన్ ఉపాధ్యక్షుడు గుబరాజు, ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి కోటిలింగాచారి కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.